Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 178 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 20 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రపంచ వేదికపై బయటపడ్డ కోల్డ్ వార్.. ప్రధాని మోదీ పక్కన ఉండగానే..




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'కు మంచి స్పందన వస్తోంది. 16వ తేదీన ప్రారంభమైన ఈ సమిట్.. 21వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఏఐ సమిట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగ్గజ ఏఐ కంపెనీలకు చెందిన లీడర్లు ఆయనతో కలిసి స్టేజిపై ఫొటోలు దిగారు. ఈ నేపథ్యంలోనే ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడీల మధ్య కోల్డ్ వార్ బయటపడింది. స్టేజ్‌పై ఉన్న వారంతా ఒకరి చెయ్యి మరొకరు పట్టుకుని ఫొటోకు ఫోజిచ్చారు. అయితే పక్క పక్కనే ఉన్న సామ్, డారియోలు మాత్రం చేతులు కలపలేదు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ప్రధాని నరేంద్ర మోదీ పక్కనే సామ్ ఆల్ట్‌మాన్ ఉన్నారు. సామ్ పక్కనే డారియో ఉన్నారు. సామ్ తన కుడి వైపు ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ చేయి పట్టుకున్నారు. ఎడమ వైపు ఉన్న డారియో చెయ్యి పట్టుకోవటానికి మాత్రం ఆలోచించారు. అటు, ఇటు చూశారు. కానీ డారియో చెయ్యి పట్టుకోలేదు. డారియో కూడా సామ్ చెయ్యి పట్టుకోవటానికి ఆసక్తి చూపలేదు. ఇద్దరి మధ్య చాలా ఏళ్ల నుంచి కోల్డ్ వార్ నడుస్తోంది. డారియో 2021 సంవత్సరానికి ముందు ఓపెన్ ఏఐలో పని చేశారు. సామ్‌తో గొడవల కారణంగా తన సోదరి డానియెలాతో కలిసి బయటకు వచ్చేశారు. 2021లో ఈ ఇద్దరు తోబుట్టువులు కలిసి ఆంత్రోపిక్ కంపెనీని స్టార్ట్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా డారియో, సామ్‌ల మధ్య దూరం మాత్రం తగ్గలేదు. ఇప్పుడిలా ప్రపంచ వేదికపై మరోసారి ఇద్దరి మధ్య కోల్డ్ వార్ ప్రపంచానికి తెలిసిపోయింది.

## మండలిలో విజిల్స్ వేస్తూ వైసీపీ హంగామా.. అచ్చెన్నాయుడు ఫైర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ ఆందోళనతో ఏపీ శాసన మండలిలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు సభలో నిరసనకు దిగారు. చైర్మన్ పోడియం వద్ద విజిల్స్ వేస్తు హంగామా చేయడంతో సభ కొద్దిసేపు వాయిదా పడింది. సభలో వైసీపీ సభ్యుల తీరుపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి సిగ్గులేదంటూ వ్యాఖ్యలు చేశారు. మండలిలో వైసీపీ సభ్యులు చేస్తున్న హంగామాపై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు మంత్రి అచ్చెన్నాయుడు. 'చీజ్‌కి నెయ్యికి తేడా తెలియని ప్రతిపక్షం ఉండటం మన దౌర్భాగ్యం' అని వ్యాఖ్యానించారు. గత మూడు రోజులుగా ప్రభుత్వం తరపున స్పష్టమైన సమాధానాలు ఇస్తున్నా వైసీపీ సభ్యులు కావాలని సభా సమయాన్ని వృధా చేస్తున్నారని ఆరోపించారు. ఇందాపూర్‌కు హెరిటేజ్‌కు ఏ సంబంధం ఉన్నా ఆధారాలు తీసుకొచ్చి చూపించాలని.. గంటల తరబడి చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి సవాల్ విసిరారు. ఎల్‌వోపీ బొత్స సత్యనారాయణ ప్రెస్‌మీట్ పెట్టి.. చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'ఒక సీనియర్ సభ్యుడిగా ఉన్న బొత్సకు చీజ్‌కి నెయ్యికి తేడా కూడా తెలియడం లేదు. ఇది మన దౌర్భాగ్యం' అని అన్నారు. హెరిటేజ్ సంస్థ లీగల్ నోటీసులు ఇచ్చినా వైసీపీ బుద్ధి మార్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల కల్తీ నెయ్యిని డైవర్ట్ చేసేందుకు



హెరిటేజ్ సంస్థపై అభాండాలు మోపుతున్నారని మంత్రి ఆరోపించారు. హెరిటేజ్ ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపారం చేయబోమని నిర్ణయం తీసుకుందన్నారు. 'ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని సాక్షి, భారతి సిమెంట్స్ ద్వారా ప్రజల సొమ్ము దోచుకున్న జగన్ మాదిరి హెరిటేజ్ ఎప్పుడూ చేయదు' అని స్పష్టం చేశారు. వైసీపీ ఫ్యాక్షన్ మనస్తత్వంతో ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయాలని హెరిటేజ్ ప్రతిష్ఠను దిగజార్చే కుట్ర చేస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'ఆధారాలతో సభలో చదివి సమాధానం అడగండి... ఎంత సేపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా వచ్చి సమాధానం చెప్పాలంటే ఎలా చెప్పాలని ప్రశ్నించారు. చైర్మన్ సభను ఆర్డర్‌లో నడిపించి, ఆటంకం కలిగించే సభ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

## వివేకా హత్య కేసు.. ఉదయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి : సునీత




**అమరావతి, (రాజధాని వార్తలు):** వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కుమార్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ జీఎం సుమన్ సర్కార్‌కు వివేకా కుమార్తె సునీత లేఖ రాశారు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారని ప్రశ్నించారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్నప్పటికీ.. ఉదయ్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆమె పేర్కొన్నారు. శాఖాపరమైన దర్యాప్తును వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఉదయ్ కుమార్ రెడ్డి ప్రవర్తన, సీబీఐ అధికారిపై ఆయన చేసిన ఫిర్యాదుపై కూడా విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయడంలో 11 నెలలు జాప్యం చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సునీత కోరారు. ఏప్రిల్ 2023 నుంచి చేసిన చెల్లింపులపై పూర్తి స్థాయి ఆడిట్ చేయాలన్నారు. ఉదయ్ కుమార్‌రెడ్డిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను 15 రోజుల్లో తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. హత్య కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం విఫలమవడంపై సునీత అసం తృప్తి వ్యక్తం చేశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో జాప్యం, పాలనాపరమైన లోపాలపై తాను అవసరం అయితే విజిలెన్స్, న్యాయపరంగా చర్యలు తీసుకుంటానని లేఖలో సునీత హెచ్చరించారు.

**సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తా..**

వైఎస్ సునీత గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'మా తండ్రి హత్య కేసులో ఏ6 అయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి సుమారు 500 రోజులు జైల్లో ఉన్నారు. అలాంటి వ్యక్తిపై యురేనియం కార్పొరేషన్ ఎందుకు చర్యలు చేపట్టలేదు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఇలా ఎప్పుడూ జరగలేదు. 495 రోజులు జైల్లో ఉంటే యూసీఐఎల్ సంస్థలో ఎలాంటి సెలవు పెట్టాడు. ఎందుకు చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తాను' అని అన్నారు.

## హెరిటేజ్‌పై వ్యతిరేక కథనాలను తొలగించాలి.. సాక్షి మీడియాకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు




**ఢిల్లీ :** సాక్షి మీడియాపై హెరిటేజ్ సంస్థ.. ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వైసింది. సాక్షి మీడియాపై రూ.వంద కోట్లకు హెరిటేజ్ సంస్థ దావా వేసింది. హెరిటేజ్‌పై ప్రచురించిన వ్యతిరేక కథనాలను వెంటనే తొలగించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కథనాలతో పాటు ప్రసారాల వీడియో లింక్‌లను కూడా తొలగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది. హెరిటేజ్‌కు వ్యతిరేకంగా ఎవరైనా రాసి ఉంటే.. వాటినీ తొలగించాలని హుకుం జారీ చేసింది. తమ ఆదేశాలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

## రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి మరోసారి ఈడీ సమన్లు

**న్యూఢిల్లీ :** రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి మరోసారి సమన్లు అందాయి. గత కొంతకాలంగా విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘనల కేసులో విచారణను ఎదుర్కొంటున్న ఆయనకు, ఈనెల 26వ తేదీన తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశాలు జారీ చేసింది.

**ఈ కేసుకు సంబంధించిన ముఖ్యాంశాలు:**

ఇటీవల ఈడీ జారీ చేసిన సమన్లకు అనిల్ అంబానీ గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయనకు రెండోసారి నోటీసులు పంపారు. ఆయన సతీమణి టీనా అంబానీని కూడా ఈడీ విచారించాల్సి ఉంది. అయితే ఆమె కూడా గతంలో రెండు సార్లు విచారణకు హాజరు కాలేదు. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి అంబానీ కుటుం



బంపై ఈ విచారణ కొనసాగుతోంది. విదేశాల్లోని వారి ఆస్తులు, లావాదేవీల గురించి ఈడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా, ఈనెల 26న అనిల్ అంబానీ విచారణకు హాజరవుతారా, లేదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వరుసగా విచారణకు గైర్హాజరు కావడం వల్ల భవిష్యత్తులో ఈడీ ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నది ఆసక్తికరంగా మారింది.

## ఏపీకి వైసీపీ హానికరం.. జగన్‌పై పయ్యావుల తీవ్ర వ్యాఖ్యలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ అసెంబ్లీ వేదికగా పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు.

**వడ్డీ రేట్లు తగ్గేలా చర్యలు..**

అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు రూ.2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు మంత్రి. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు.

**భూకేటాయింపుల్లో లాభాలు, నష్టాలు..**

కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్ర బాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తు చేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.

**రాయలసీమ హార్టికల్చర్ హబ్‌పై...**

రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

**జగన్‌పై విమర్శలు..**

అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ఫైర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు.

## విశాఖ ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో జరిగిన ఓ దారుణ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల వయసున్న పసికందుపై జరిగిన లైంగిక దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు నాగరిక సమాజానికి మచ్చ అని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే రాయపాటి శైలజ విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని, నిందితుల వివరాలను రాయపాటి శైలజ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆమె ఆరా తీశారు. చిన్నారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని




అధికారులను ఆదేశించారు. ఈ కేసులో నిందితులకు చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షపడేలా.. మహిళా కమిషన్ పక్షాన పర్యవేక్షిస్తామని రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

# "ప్రభుత్వానికి కాకాణి సవాల్"

**- ఇందాపూర్ డెయిరీపై చర్చంటే భయమెందుకు? - ఆ డెయిరీతో హెరిటేజ్ బంధం నిజమా? కాదా? - చంద్రబాబుకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూటి ప్రశ్న - వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి - కల్తీ నెయ్యి ముసుగులో ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు చంద్రబాబు కుట్ర - కేజీ నెయ్యి ధర రూ.658కి పెంచి ఇందాపూర్ డెయిరీకి టెండర్ కట్టబెట్టాడు - వ్యాపార సంబంధం బయట పడ్డంతో చర్చకు భయపడి వెనకడుగు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడి - ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్‌కు దోచిపెట్టే కుట్ర - అడ్డంగా దొరకడంతో సున్నిత అంశమంటూ సన్నాయి నొక్కులు - హెరిటేజ్ ఇందాపూర్ డెయిరీల లింక్.. రాష్ట్ర అప్పులు - నిషేధిత భూముల 22-ఏ జాబితా - దేనిపై అయినా మేం చర్చకు సిద్ధం. మీరు రెడీనా? : ప్రభుత్వానికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్**

**తాడేపల్లి, (రాజధాని వార్తలు):** ఇందాపూర్ డెయిరీ ముసుగులో టీటీడీ నిధులు హెరిటేజ్‌కి మళ్లించి భారీ అవినీతికి పాల్పడింది నిజం కాబట్టే దానిపై మండలిలో చర్చకు వైయస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం భయంతో పారిపోయిందని నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాదిన్నరగా కల్తీ నెయ్యి ముసుగులో ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు చంద్రబాబు కుట్ర చేశాడని.. అవన్నీ బహిర్గతమై నిండా మునిగిపోయిన చంద్రబాబు లడ్డూ సున్నితమైన అంశమని తానిక దాని గురించి మాట్లాడనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడంటూ కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 300లకు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందంటూ చంద్రబాబు చేసిన ప్రచారం వెనుక కారణం ఇందాపూర్ డెయిరీకి నెయ్యి సప్లై కాంట్రాక్టు కేజీ రూ. 658లకు కట్టబెట్టడానికేనని స్పష్టం చేశారు. కూటమి నాయకులకు దమ్ముంటే కల్తీ నెయ్యి, రాష్ట్ర అప్పులు, 22 ఏ భూములు.. దేనిపైనయినా చర్చకు సిద్ధమని కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు.

**ప్రెస్‌మీట్‌లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..:**

**కలియుగదైవంతో చంద్రబాబు చెలగాటం:**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తులు అతి పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు ఆర్థికంగా, రాజకీయంగా లబ్ధి పొందాలని తీవ్రమైన కుట్ర చేశాడు. దేవుడిని రాజకీయాల్లోకి చేయరాని పాపం మూటకట్టుకున్నాడు. లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు మాంసం, చేపల నూనె కలిసిందంటూ ఆధారాలు లేకుండా తీవ్రమైన ఆరోపణలు చేసి కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుకున్నాడు. సీబీఐ సిట్ ఛార్జిషీట్ సాక్షిగా చంద్రబాబు చెప్పినదంత అబద్ధమని తేల్చినా ఆగకుండా బాత్రూమ్ క్లీన్ చేసే కెమికల్స్ కలిపారంటూ ఇంకా దిగజారి ప్రచారం చేశాడు. కానీ కలియుగదైవంతో చెలగాటం ఆడిన చంద్రబాబు.. అటు సిట్ చార్జిషీట్, ఇటు ఇందాపూర్ డెయిరీ వ్యవహారంతో అడ్డంగా దొరికిపోయాడు. తాను తీసుకున్న గోతిలో ఆయనే కూరుకుపోయాడు.

**చర్చకు భయపడి వాయిదా తీర్మానంపైనా కుట్రలే:**

ఇందాపూర్ డెయిరీ ముసుగులో తన కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్ డెయిరీకి టీటీడీ నిధులు మళ్లించాలని చంద్రబాబు స్కెచ్ వేశాడు. ఆ కుట్రలో భాగంగానే కల్తీ నెయ్యి డ్రామాకు తెరదీసి రాజకీయంగా వైయస్సార్‌సీపీని ఇరికించే ప్రయత్నం



చేశాడు. నెయ్యి ధరలు పెంచేసి సప్లై టెండర్లు ఇందాపూర్ డెయిరీకి కేజీ రూ. 658లకు కట్టబెట్టేశాడు. ఇందాపూర్ డెయిరీ ముసుగులో టీటీడీ సొమ్మును హెరిటేజ్ డెయిరీకి మళ్లించే ప్రణాళికలో భాగంగా చంద్రబాబు నడిపిన కల్తీ నెయ్యి డ్రామాపై మండలిలో చర్చించాలని వైయస్సార్‌సీపీ పట్టుబడితే చైర్మన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. ఇక్కడ కూడా ప్రభుత్వం కుట్ర చేసింది. వైయస్సార్‌సీపీ నుంచి ఎన్నికై, టీడీపీలో చేరిన బల్లి కళ్యాణ చక్రవర్తి, మర్రి రాజశేఖర్ ద్వారా టీడీపీ మరో వాయిదా తీర్మానం ప్రవేశ పెట్టించింది. ఇందాపూర్ డెయిరీపై చర్చ జరిగితే తిరుమల లడ్డూ పేరుతో చంద్రబాబు చేసిన కుట్రలన్నీ బయటకొస్తాయని ప్రభుత్వం వణికిపోతోంది. ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా అంశంపై వైయస్సార్‌సీపీ సభ్యులు ఆర్.రమేష్ యాదవ్, కేఆర్‌జె భరత్, డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వాయిదా తీర్మానం కోరగా.. తిరుమల లడ్డూ ప్రసాదం గురించి టీడీపీకి అమ్ముడుబోయిన బల్లి కళ్యాణచక్రవర్తి, మర్రి రాజశేఖర్ మరో వాయిదా తీర్మానం కోరారు. వైయస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీలను టీడీపీలో చేర్చుకుని వారితోనే ప్రభుత్వం కుట్రపూరితంగా వాయిదా తీర్మానం పెట్టించింది. ఇన్ని కుట్రలు చేసి మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారంటూ నారా లోకేష్ మాట్లాడిన మాటలు ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనం.

**ఇందాపూర్ డెయిరీ ముసుగులో టీటీడీ నిధుల దోపిడీ**

ఇందాపూర్ డెయిరీ ముసుగులో 2014-19 మధ్య వందల కోట్లు టీటీడీ నిధులను హెరిటేజ్ డెయిరీకి మళ్లించిన చంద్రబాబు.. 2024 లో అధికారంలోకి వచ్చిన తర్వాత నెయ్యి ధరలు పెంచి దోచుకునే కుట్రకు తెరదీశాడు. అందులో భాగంగానే రూ. 300లకు నాణ్యమైన నెయ్యి వస్తుందా అనే ప్రచారం మొదలుపెట్టి, ఇందాపూర్ డెయిరీకి డిసెంబర్ 2025లో కేజీ రూ. 658కి నెయ్యి సప్లై టెండర్లు కట్టబెట్టాడు. తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యి కల్తీ ముసుగులో చంద్రబాబు చేసిన కుట్రలను ఆధారాలతో సహా వైయస్సార్‌సీపీ భగ్నం చేసింది. హెరిటేజ్ వెబ్‌సైట్ సాక్షిగా చంద్రబాబు దొరికిపోయాడు. దేవుడి ప్రతిష్టను పణంగా పెట్టి దోపిడీకి పాల్పడ్డ చంద్రబాబు చర్యలను దేశవ్యాప్తంగా ప్రజలు చీకొడుతున్నారు. ఏడాదిన్నరగా చంద్రబాబు రక్తి కట్టించిన కల్తీ కుట్రకు వైయస్సార్‌సీపీ తెరదించడంతో ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలోకి పడిపోయింది. అందుకే మండలిలో చర్చకు వైయస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం భయంతో పారిపోయింది. ఇన్నాళ్లూ తిరుమల ప్రతిష్టను పట్టించుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడిన చంద్రబాబు, అడ్డంగా దొరికిపోయిన తర్వాత ఇది సున్నితమైన అంశం.. ఇకపై మాట్లాడను అంటూ నాలుక మడతేశాడు.

**మా ప్రభుత్వ అప్పులపై దుష్ప్రచారం చేసి..:**

వైయస్సార్‌సీపీ హయాంలో రూ. 14 లక్షల కోట్ల అప్పులంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సహా కూటమి నాయకులు చేసిందంతా దుష్ప్రచారమేనని మండలి సాక్షిగా వారే అంగీకరించక తప్పని పరిస్థితి ఎదురైంది. వారిచ్చిన లెక్కల ప్రకారమే మొత్తం ఏపీ అప్పులు 2024 వరకు రూ. 4,91,734 కోట్లు. 2024 వరకు కార్పొరేషన్ల అప్పు రూ. 1,40,479 కోట్లని చెప్పారు. వైయస్సార్‌సీపీ హయాంలో బడ్జెట్ అప్పులు రూ. 2,34,225 కోట్లు మాత్రమేనని, కార్పొరేషన్ల అప్పులు పదేళ్లలో రూ. 1,40,479 కోట్లుగా వారే అంగీకరించినట్టయింది. ఈ 20 నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అక్షరాలా రూ. 3,28,225 కోట్లు అప్పులు చేసి దాని గురించి ప్రశ్నిస్తే మాత్రం నోరు మెదపడం లేదు. ఐదేళ్లలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పును టీడీపీ కూటమి ప్రభుత్వం 20 నెలల్లోనే చేసేసింది. వైయస్ జగన్ వివిధ పథకాల రూపంలో డీబీటీ ద్వారా ఏకంగా రూ. 2.75 లక్షల కోట్లు లబ్ధి చేకూరిస్తే, చంద్రబాబు మాత్రం సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క పథకం అమలు చేయకుండానే భారీగా అప్పులు చేస్తున్నాడు. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నాడు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశాడు.

**22-ఏ భూముల సమస్య చంద్రబాబు సృష్టే:**

రాష్ట్రంలో 22-ఏ భూముల సమస్య ఎక్కువగా ఉందని, జీవో అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పీకర్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచన చేస్తే.. 22-ఏ నుంచి ప్రైవేట్ భూములను బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి అనగాని సమాధానమిచ్చారు. కానీ వాస్తవం చూస్తే 22-ఏ భూముల సృష్టికర్తే చంద్రబాబు. 22-ఏ గురించి 2016-17లో ప్రత్యేకంగా జీవోలు ఇచ్చి, ప్రాహిబిటివ్ లిస్ట్ కింద పెట్టి, రైతులను, పేదలను, భూ యజమానులను ఇబ్బందులు పెట్టిన ఘనత చంద్రబాబుదే. 2019లో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను, పేదలను దృష్టిలో ఉంచుకొని వాళ్లకు శాశ్వత హక్కులు కల్పించడం జరిగింది. జగన్ విప్లవాత్మక నిర్ణయాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 20.24 లక్షల మంది పేదలు, రైతులకు ఏకంగా 35.44 లక్షల ఎకరాలపై హక్కులు లభించాయి. అసైన్డ్ ల్యాండ్ పొంది 20 ఏళ్లు దాటితే, వారి భూముల మీద వారికి పూర్తి హక్కులు కల్పించిన చరిత్ర మా వైయస్ జగన్‌కి దక్కుతుంది. ఒరిజినల్ అసైనీలకు లేదా వారి వారసులకు మాత్రమే వర్తింపజేస్తూ ఆనాడు మేము తీసుకొచ్చిన చట్టం ద్వారా ఏకంగా 15,21,160 మంది అసైన్డ్ నిరుపేదలకు, 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభించాయి. చుక్కల భూములకు సంబంధించి మరో 97 వేలకు పైగా కుటుంబాలకు చెందిన 2,06,171 ఎకరాలపై హక్కు లభించింది. షరతు కలిగిన భూములకు సంబంధించి 22 వేల మంది రైతులకు మరో 35 వేలకు పైగా ఎకరాల భూమి మీద వాళ్లకు హక్కులు వచ్చాయి. విలేజ్ సర్వీస్ ఇనాం భూముల కింద 1.58 లక్షల ఎకరాలకు సంబంధించి మరో 1.61 లక్షల మందికి మేలు జరిగిస్తూ హక్కులు కల్పించాం. కానీ వాస్తవాలను దాచిపెట్టి ఆ నెపాన్ని వైయస్సార్‌సీపీ మీదకు నెట్టే కుట్రలు చేయడం దుర్మార్గం. రైతులను ఇబ్బంది పెట్టిన ఘనత చంద్రబాబుది.

**చర్చించే దమ్ముందా?:**

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏ అంశం మీదైనా చర్చించడానికి వైయస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది. దేవుడంటే భయం భక్తి ఉంటే, కల్తీ నెయ్యి ముసుగులో అవినీతికి పాల్పడిన మాట వాస్తవం కాకపోతే మండలిలో ఇందాపూర్ డెయిరీపై చర్చించడానికి ఎందుకు భయపడుతున్నారు? నాడు రాష్ట్ర అప్పులపై మీ దుష్ప్రచారం, నిషేధిత భూముల జాబితా 22-ఏ పైనా మేము చర్చకు సిద్ధం. మరి ప్రభుత్వానికి వీటన్నింటిపై చర్చించే దమ్ముందా అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ చేశారు.

# చిన్నారులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా ఇప్పించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని ఈ ఎస్ ఆర్ ఎం హైస్కూల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచనల మేరకు 1-19 సంవత్సరాల వయసు గల బాల బాలికలు అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఈనెల 24న కూడా ఈ మాత్రల పంపిణీ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. చిన్నారుల్లో ఎదుగుదల, మెరుగైన ఆరోగ్య సంరక్షణకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని, తల్లిదండ్రులందరూ కూడా తమ బిడ్డలందరికీ ఈ మాత్రలను తప్పనిసరిగా అందించాలన్నారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్వో డాక్టర్ సుజాత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ యశ్వంత్, డెమో కనకరత్నం తదితరులు ఉన్నారు.

# ఈ-క్రాప్ నమోదును వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బుధవారం ఇందుకూరుపేట మండలం కొరుటూరు పంచాయతీలో ఆన్లైన్లో నమోదు చేసిన పంట వివరాలను కలెక్టర్ పరిశీలించారు. రైతు గండవరపు అమర్నాద్ రెడ్డి పొలములో గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఝాన్సీ ఈ- పంట యాప్ నుండి రైతుల వివరాలను డౌన్లోడ్ చేసుకొని నమోదు చేసే విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. భూమి యజమానులు కౌలు రైతుల నమోదు వివరాలను పరిశీలించారు.

నమోదు చేయునపుడు రైతుల పంట విస్తీర్ణము, పంట రకము, నాటిన తేదీ, ఆధార్ నంబరు, ఫోన్ నెంబర్ తదితర అంశాలు కరెక్ట్‌గా ఉన్నాయా అని పరిశీలించారు. ఆదార్ నెంబర్ నమోదు వలన కొనుగోలు కేంద్రానికి పంట వేసినహొ రైతులే వచ్చే అవకాసం ఉందని సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు డ్రయ్యర్ ఏర్పాటు చేయవలసినదిగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, బ్యాంకు గారంటీ, మిల్లుల టాగింగ్‌లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.










**చేనేత వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చేనేత స్టాల్స్‌ను శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ప్రారంభిస్తున్న పలువురు మంత్రులు స్టాల్స్‌ను సందర్శిస్తున్న దృశ్యాలు.**

# “జగనన్న పాలన భేష్ అంటున్న ప్రజలు – కాకాణి”






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పొదలకూరు మండల కేంద్రంతో పాటు, విరువూరు, నేదురు మల్లి, గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. మాజీ మంత్రి కాకాణికి ఘన స్వాగతం పలికిన గ్రామాల ప్రజలు, మహిళలు. జగనన్న కిడ్నీ బాధితులకు ఇచ్చిన పదివేల రూపాయల పెన్షన్ తోనే తాను ఇంతకాలం జీవించగలిగానని కాకాణి ముందు భావోద్వేగానికి గురైన విరువూరు వాసి మహిమలూరు వెంకయ్య. జగనన్న హయంలో మంజూరైన పెన్షన్లు, మంత్రిగా మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, తాము ఎన్నటికీ మరువలేమన్న నేదురు మల్లి గ్రామవాసులు. జగనన్న పాలనలో రైతులకు భరోసా ఉండేదని, కూటమి పాలనలో అష్ట కష్టాలు పడుతున్నామంటూ కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన పలువురు స్థానిక రైతులు. యూరియా కోసం అనేక ఇబ్బందులు పడి, ఎంతో శ్రమకోర్చి బ్లాక్‌లో కొనుగోలు చేశామంటూ తమ బాధలను కాకాణి ఎదుట వెల్లడించిన రైతు కుటుంబాలు. జగనన్న పాలన అన్ని విధాల భేష్‌గా ఉండేదని, నేటి కూటమి పాలన అందరిని మాయమాటలతో మోసం చేయడం తప్ప, ఆదుకునే పరిస్థితి లేదని పేర్కొన్న గ్రామస్తులు. నన్నం రమేష్, శారద దంపతుల కుమార్తె చందుషాను.. నూతన దంపతులు యాకోబు, కృపా మేరీని ఆశీర్వదించి, ఇటీవల తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన గొట్టి గుండాల రామ్మోహన్ రెడ్డిని మరియు కరణం పెంచల నాయుడుని పరామర్శించిన – కాకాణి. జగన్మోహన్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి, రైతులకు అన్ని విధాల అండగా నిలిచారు. కూటమి పాలనలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూ, రైతులను అధోగతి పాలు చేస్తున్నారు. రైతాంగం యూరియా కోసం పడిన బాధలు వర్ణనాతీతం. రైతులు శ్రమించి పండించిన పంటకు, ప్రభుత్వం కనీసం మద్దతు ధర కల్పించాలి. జిల్లా యంత్రాంగం మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి, రైతుల దగ్గర ధాన్యం సేకరించకపోతే, రైతులు తీవ్రంగా నష్టపోతారు. ధాన్యం సేకరణ విషయంలో జిల్లా అధికారులు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే, రైతుల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడటానికి సిద్ధం. జగనన్న హయాంలో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం, రెండుసార్లు అర్హత కలిగిన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారు. కూటమి పాలన అధికారంలోకి వచ్చాక కొత్త పెన్షన్ల ఊసే లేకుండా అర్హులందరికీ మొండి చేయి చూపించారు. ప్రజలలో జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు చేస్తున్న మోసాలపై విస్తృత స్థాయి చర్చ జరుగుతుంది. ప్రజలందరూ జగనన్న పాలనను తిరిగి కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పటికే విసిగి వేసారిపోయిన ప్రజలు, చంద్రబాబును సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారు. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని, గాలికి వదిలేసి రోజుకో కొత్త పాట పాడుతూ, డైవర్షన్ పాలిటిక్స్‌కు పూనుకుంటున్నాడు. చంద్రబాబు నాయుడు ప్రవర్తిస్తున్న తీరు, మాట్లాడుతున్న విధానం చూసి, ప్రజలు అసహ్యించుకుంటున్నారు. జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఎటువంటి కష్టం కలిగినా, కుటుంబ సభ్యులులాగా అందరం కలిసి పోరాడుతాం. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమవుతూ, ప్రజల అవసరాలు తెలుసుకొని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తాం.

# కోవూరు సీహెచ్‌సీని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయండి

**- కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలవాసుల వైద్య సేవలకు కోవూరులోని సిహెచ్‌సి మాత్రమే ఆధారం - పెరిగిన జనాభా, వైద్య అవసరాలకు ప్రస్తుతమున్న వైద్యశాల సరిపోవడం లేదు - 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుతాయి : శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసన సభలో ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసన సభలో ఆమె మాట్లాడుతూ..కోవూరుతో పాటు విడవలూరు, కొడవలూరు మండలాలకు చెందిన దాదాపు 2 లక్షల మంది ప్రజలకు ఈ ఆసుపత్రే ప్రధాన వైద్య కేంద్రమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 50 పడకల సామర్థ్యం ఏమాత్రం సరిపోవడం లేదని, దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు పట్టణం భౌగోళికంగా ముంబై జాతీయ రహదారి (NH-16), కృష్ణపట్నం పోర్ట్ – బళ్లారి జాతీయ రహదారి (NH-67)ల మధ్య ఉండగా.. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె సభకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను అత్యవసరంగా నెల్లూరు తరలించే క్రమంలో ట్రాఫిక్ అంతరాయం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కోవూరులోనే 100 పడకల ఆసుపత్రి ఉంటే అత్యవసర వైద్య చికిత్సలందించి ప్రాణాలను కాపాడవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సభ దృష్టికి తెచ్చారు.

**కోవూరు హాస్పిటల్ లో డయాలసిస్ యూనిట్**

కోవూరు ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తుల కష్టాలను ప్రస్తావిస్తూ నెల్లూరు GGHలో ఒకే డయాలసిస్ యూనిట్ ఉండడంతో రద్దీ కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో ప్రైవేటు హాస్పిటల్స్ కు వెళ్లాల్సి వస్తుందని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంత వాసుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోవూరు ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కోవూరు ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల సేవలు మరియు అధునాతన ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. దీనివల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రి (GGH) పై ఒత్తిడి తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు.

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చేనేత స్టాళ్లను సందర్శించిన హోం మంత్రి అనిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (ఆప్కో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను గురువారం హోం మంత్రి అనిత సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల చేనేత కళాకారుల నైపుణ్యానికి ప్రతిరూపాలుగా నిలిచే ఉత్పత్తులు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయని మంత్రి అనిత పేర్కొన్నారు. పొందూరు ఖాదీ, వెంకటగిరి, ధర్మవరం పట్టు చీరల నుండి మంగళగిరి, బందరు (మచిలీపట్నం) మరియు మాధవరం చేనేత వస్త్రాల వరకు అద్భుతమైన కలెక్షన్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడం, మన నేతన్నల శ్రమకు తగిన గుర్తింపునివ్వడం మనందరి బాధ్యత అని మంత్రి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం మరియు



ఉత్పత్తుల ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ స్టాళ్లు బడ్జెట్ సమావేశాలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

# నిబంధనల మేరకు జర్నలిస్టులకు అక్రెడిటేషన్

**- జీవోఎంఎస్ నెం.84 ప్రకారం జిల్లాలో తొలి విడత 742 కార్డుల జారీ : జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిల్లాలో అర్హత ప్రమాణాలున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, తొలి విడత 742 కార్డులను జారీచేసి, పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ) ఛైర్మన్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ గురువారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మంజూరైన అక్రెడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల కాలపరిమితి పూర్తయినందున నూతన అక్రెడిటేషన్ కార్డుల మంజూరుకు జీవోఎంఎస్ నెం.84లోని నిబంధనలు, మార్గదర్శకాల మేరకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్రెడిటేషన్ కార్డుల కోసం జర్నలిస్టులు చేసుకున్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తొలి విడతగా 742 అక్రెడిటేషన్ కార్డులు జారీకి డీఎంఏసీ ఆమోదం తెలిపిందన్నారు. అక్రెడిటేషన్ మంజూరైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని 2027, డిసెంబర్ వరకు అమల్లో ఉంటాయన్నారు. ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పారదర్శకంగా పరిశీలించి, అర్హత ఉన్న వారికి కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరలోనే తదుపరి విడతలో కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమైందన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వ యంత్రాంగానికి సూచనలు సలహాలు అందిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో పారదర్శకమైన సేవలు అందించడంలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఆడియో విజువల్ పర్యవేక్షకులు వి.వి.ప్రసాద్, డీమ్యాక్ సభ్యులు, ఉప కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి, పి.నాగమల్లేశ్వరరావు, కలిమిశ్రీ, యామినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా భీమేశ్వరుని శ్రీపుష్ప యాగం, తెప్పోత్సవ పూజలు – భారీగా తరలి వచ్చిన భక్తులు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహా శివరాత్రి మహోత్సవాలు ముగింపులో భాగంగా పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లకు శ్రీ పుష్పయాగం, ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా, కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారు, అమ్మవారలను ప్రత్యేక వేదికపై ఉంచి ఆలయ పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం దేవాతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రీతిలో సుందరంగా అలంకరించిన పడవపై ఆశీనులను చేసి, హారతి పూజలు చేపట్టి తెప్పోత్స వాన్ని ప్రారంభించారు. సుమారు గంటపాటు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించి అనంతరం స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగ పూజలు, ఊయల సేవ పూజలను నిర్వహించారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ కంటే జగదీశ్ మోహన్, ఆలయ ధర్మకర్తలు, కూటమి నాయకులు, ఆలయ పండితులు, సిబ్బంది, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## హక్కు ఆధారిత చట్టాలు ఇక ప్రభుత్వ దయ!

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుతో దేశంలో ఒక కీలకమైన రాజకీయ ప్రశ్న ముందుకు వచ్చింది: సంక్షేమాన్ని పౌరుల హక్కుగా పరిగణించే ఆలోచన నుంచి భారత ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకుంటున్నదా? ఈ పరిణామం కేవలం ఒక పథకం ముగింపునకు సంబంధించింది కాదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో పౌరుడికి, రాజ్యానికి మధ్య ఉన్న సామాజిక ఒప్పందంలో వస్తున్న పెనుమార్పుకు సంకేతం. ఒక్క 'నరేగా' విషయంలోనే కాదు; సమాచార హక్కు చట్టం, జాతీయ ఆహార భద్రతా చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి హక్కుల ఆధారిత చట్టాల భవిష్యత్తుపైనా ఇలాంటి ఆందోళనే కలుగుతోంది. ముఖ్యంగా గత పదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో సంక్షేమాన్ని చట్టబద్ధమైన హక్కుగా నిర్వహించటం మానేసి, పరిపాలనా నిర్ణయాలు, కార్యనిర్వాహక నియంత్రణల ద్వారా నిర్వహించాలన్న ధోరణి పెరగటం చూస్తున్నాం. స్వాతంత్ర్యానికి ముందు దశలో తొలి జాతీయవాదులు పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం కాదనీ, వలస పాలనలోని దోపిడీకి వ్యవస్థాగత ఫలితమనీ వాదించారు. పేదరికాన్ని కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా ఒక నిర్మాణాత్మక సమస్యగా చూడాలనే ఈ దృక్పథం, నాటి వామపక్ష రాజకీయ - ఆర్థిక ఆలోచనల ప్రభావంతో మరింత బలపడింది. "స్వతంత్ర భారతదేశ ప్రధాన కర్తవ్యాలు: ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం పెట్టడం; దుస్తులు లేని ప్రజలకు దుస్తులు ఇవ్వడం," అని రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రకటనలో ఇదే భావన ప్రతిఫలిస్తుంది. అయితే స్వాతంత్ర్యం తర్వాతి కాలంలో పేదరిక నిర్మూలన అనేది ప్రధానంగా ప్రభుత్వ నేతృత్వంలోని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపంలోనే కొనసాగింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సామాజిక న్యాయం పట్ల రాజ్యానికి ఉన్న బాధ్యతను స్పష్టంగా ప్రకటించినప్పటికీ, అవి చట్టపరంగా అమలు చేయాల్సిన హక్కులుగా మారలేదు. ఫలితంగా సంక్షేమం పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, పాలనాపరమైన విచక్షణ పైన, రాజకీయ సంకల్పంపైన ఆధారపడిన అంశంగా కొనసాగింది. ఈ పరిమితిని రాజ్యాంగ రూపకల్పన దశలోనే చూడవచ్చు. పని హక్కును ప్రాథమిక హక్కులలో ఎందుకు చేర్చలేదని ప్రముఖ రచయిత ముల్కరాజ్ ఆనంద్ స్వయంగా అంబేడ్కర్‌ను ప్రశ్నించినప్పుడు, ఆయన, "రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీలో నేనొక్కడినే లేను" అని సమాధానమిచ్చారు. అంటే పనిని హక్కుగా మలిచే రాజకీయ సంకల్పం అప్పుడే సంపూర్ణంగా రూపుదిద్దుకోలేకపోయింది. ఈ వైఖరే స్వాతంత్ర్యానంతర కాలంలో సంక్షేమ హక్కుగా గాక, పథకాల రూపంలో కొనసాగడానికి ఒక ముఖ్య కారణంగా మారింది. 1991లో కేంద్ర ప్రభుత్వం ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయడం ప్రారంభించిన తరువాత, వాటి ఫలితంగా ఏర్పడిన అసమానతలకు ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆహారం, ఉపాధి, పారదర్శకత, గౌరవం వంటి మౌలిక అంశాల చుట్టూ సాగిన ఈ పోరాటాలు సంక్షేమాన్ని హక్కుల ఆధారంగా పునఃరూపకల్పన చేయాలన్న ఆలోచనకు బలమైన పునాదిని వేశాయి. ఈ ఉద్యమాలలో అత్యంత ప్రభావవంతమైనది రాజస్థాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ నేతృత్వంలో సాగిన సమాచార హక్కు ఉద్యమం. 'హమారా ఖర్చా, హమారా హిసాబ్' (మన సొమ్ము- మన లెక్కలు) అనే నినాదంతో ప్రజా పనులకు సంబంధించిన అవినీతిని బహిర్గతం చేసిన ఈ ఉద్యమం, 'పారదర్శకత'ను 'వేతనాలు', 'ఉపాధి' వంటి కార్మికుల మౌలిక హక్కులతో నేరుగా ముడిపెట్టింది. సమాచారాన్ని కేవలం ఒక సూత్రంగా గాక, న్యాయమైన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన అనివార్యమైన షరతుగా ప్రజల ముందుకు తెచ్చింది. అదే సమయంలో, ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ ఆకలి, పోషకాహార లోపాలు ఎందుకు కొనసాగుతున్నాయన్న ప్రశ్నతో ఆహార హక్కుల ఉద్యమాలు మొదలయ్యాయి. 2001లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి, ఆహార హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు) నుంచి ఉద్భవించిందని వాదించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తదుపరి ఉత్తర్వులు ప్రజా పంపిణీ వ్యవస్థను, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను జీవించే హక్కుతో ముడిపడిన చట్టబద్ధ హక్కులుగా గుర్తించాయి. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాల ద్వారా వచ్చిన హక్కుల డిమాండ్లను చట్టరూపంలోకి తేవడానికి ఒక రాజకీయ అవకాశం ఏర్పడింది. సామాన్యుడి కోసం పాలన అందిస్తామని ప్రకటించిన యూపీఏ ప్రభుత్వం ప్రజా ఒత్తిళ్లకు స్పందించక తప్పలేదు. అందువల్లనే - 'సమాచార హక్కు చట్టం' (2005), 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (2005), 'అటవీ హక్కుల చట్టం' (2006), 'జాతీయ ఆహార భద్రతా చట్టం' (2013) వంటి కీలక హక్కుల ఆధారిత చట్టాల అమలు మొదలైంది. ఈ చట్టాలు సంక్షేమాన్ని పరిపాలనా విచక్షణ పరిధి నుంచి బయటకు తీసి, అమలు చేయాల్సిన చట్టబద్ధ హక్కులుగా మార్చాయి. కానీ గత దశాబ్ద కాలంగా ఈ హక్కుల ఆధారిత చట్టాలు బలహీనమవుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిని అమలు చేయాలన్న రాజకీయ సంకల్పం తగ్గడమే. సంక్షేమాన్ని పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, నియంత్రణలు, పరిపాలనా విధానాల ద్వారా నిర్వహించాలన్న పాత దృక్కోణం మరలా బలపడింది. ఈ ధోరణి ఒకటి రెండు విధాన నిర్ణయాలకు పరిమితం కాకుండా, నిరంతర పరిపాలనా చర్యలు, మార్గదర్శకాలు, సాంకేతిక షరతుల రూపంలో వ్యవస్థాగతంగా లోతుగా పాతుకుపోయింది.

# తపస్సుకాల దీక్షాపరులకు దుస్తులను అందించిన కోడిగుడ్ల శ్రీధర్

### - గుడ్ ఫ్రైడే & ఈస్టర్ సందర్భంగా విశాఖ 41వ వార్డులో క్రైస్తవ దీక్షలు చేపట్టనున్న ప్రజలు - వార్డు కార్యాలయం వద్ద దుస్తులను అందించిన శ్రీధర్ - శ్రీధర్ అందిస్తున్న సేవలపై ప్రజలు హర్షం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** క్రైస్తవులు దీక్షలు చేపట్టే సమయం ఆసన్నమైంది. వారి సమస్యలు, కోరికలు తీరా లని, ఆధ్యాత్మిక ఎదుగుదల మరియు మానసిక ప్రశాంతత కొరకు దీక్షలు చేపడుతుంటారు. విశాఖ 41 వార్డు జ్ఞానాపురం పరిధిలో ప్రతీ ఏటా క్రైస్తవులు ఉపవాస దీక్షలు స్వీకరిస్తుంటారు. ఈ క్రమంలో ఉపవాస దీక్షలు చేపట్టే వారికి వార్డు వైసీపీ అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్ ఉచితంగా దుస్తులను అందించారు. వార్డు కార్యాలయం వద్ద మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులను అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు వైసీపీ అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్ అందిస్తున్న సహాయానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఉపవాస దీక్ష తీసుకున్న వారికి తమ వంతు చేయూత అందించాలనే లక్ష్యంతో ఉచితంగా దుస్తులను అందించామని, దైవభక్తితో మాలలు ధరిస్తే వారి సమస్యలు తొలగిపోతాయని ప్రజల విశ్వాసమని కోడిగుడ్ల శ్రీధర్ తెలిపారు. జ్ఞానపుర ప్రజలను ఆధ్యాత్మికతలో నడిపిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు ఉడుముల బాలకి, జ్ఞానాపురం విచారణ గురువులు జొన్నాడ జాన్ ప్రకాష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రజలతో కలసి ప్రార్థన కార్యక్రమంలో శ్రీధర్ పాల్గొన్నారు. ప్రజలకు తమ సేవలను నిరంతరం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సునీల్ కుమార్, విక్రాంత్, కిషోర్, మురళి, ఆనంద్, దేవి, మణి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "వత్సవాయి వైభవం" పుస్తకావిష్కరణ


**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రచయిత రామిశెట్టి శ్రీకాంత్ రచించిన "వత్సవాయి వైభవం" పుస్తకావిష్కరణ కార్యక్రమం పెద్దాపురం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో వత్సవాయ వంశస్థులు రాజా సూరిబాబురాజు స్వగృహం వద్ద ఘనంగా జరిగింది. వత్సవాయి వైభవం తొలి కాపీని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆవిష్కరించి సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డా. జోస్యుల కృష్ణబాబు మాష్టారుకి అందజేసారు. అనంతరం పెద్దాపురం శాఖా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజుకు, యాసలపు సూర్యారావు గ్రంథాలయం నిర్వాహకులు సిరిపురపు శ్రీనివాస్‌లకు గ్రంథాలయ కాపీలను అందించారు. ఈ సందర్భంగా పుస్తకావిస్కర్త సూరిబాబు రాజు మాట్లాడుతూ కృష్ణ జిల్లా వత్సవాయి గ్రామం నుండి చారిత్రక పెద్దాపురం వరకూ సాగిన వత్సవాయి వంశస్థుల ప్రస్థానాన్ని ఎంతో శ్రమకోర్చి రచించిన యువ రచయిత రామిశెట్టి శ్రీకాంత్ కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్బంగా ఆయనను సత్కరించి అభినందించారు. పెద్దాపురం చరిత్రను అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు కృషి చేస్తున్న సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణ బాబు, చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ లకు అభినందనలు తెలియజేశారు. పెద్దాపురంలో సాహితీ స్రవంతి భవనానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక నిధులు కేటాయించారని త్వరలోనే ఆ పనులు ప్రారంభం అవుతాయని సూరిబాబు రాజు ప్రకటించారు. చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ మాట్లాడుతూ పెద్దాపురం చరిత్రపై పుస్తకం ఎవరు రచించినా వారికి అన్నిరకాలుగా సహకారం అందించే ప్రధాన లక్ష్యంలో భాగంగా రచయిత రామిశెట్టి శ్రీకాంత్‌ని ప్రోత్సహించడం జరిగిందని, ఈ పుస్తక పరిశోధన కోసం సమాచార సేకరణ కోసం



శ్రీకాంత్ అనేకమార్లు పెద్దాపురం రావడం జరిగిందని రాజా సూరిబాబు రాజు ప్రోత్సాహంతో పుస్తకావిష్కరణకి ముందడుగు వేసి, ఈ రోజు ఆయన చేతుల మీదుగా ఆవిష్కరణ జరుపుకోవడం విశేషం అన్నారు. రచయిత రామిశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ వంగలపూడి శివకృష్ణ రచించిన చారిత్రక పెద్దాపురం కథలు, గాథలు స్ఫూర్తితో రాజా సూరిబాబు రాజు ప్రోత్సాహంతో మా వత్సవాయి గ్రామ చరిత్ర, గ్రామదేవత వత్సవాయమ్మ చరిత్ర కూడా రచించాలని సంకల్పించానని తెలిపారు. గుడిమెట్ట ధీరుల అకుంఠిత దీక్ష, వత్సవాయి రాజుల అజేయ శౌర్యం, పెద్దాపుర సంస్థానాధీశుల సాటిలేని వైభవం, తరతరాల చారిత్రక వారసత్వానికి, ధర్మపథంలో సాగిన మహోజ్వల క్షత్రియ చరిత్రకు అక్షరరూపం ఈ "వత్సవాయి వైభవం" పుస్తకం అన్నారు. పుస్తక పరిశోధనకి ఎంతగానో సహకరించిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి సభ్యులు తాడిగడప సుబ్బారావు, చర్ల రామారావు, పూడి శ్రీనివాసరావు, దారపురెడ్డి క్రాంతి కుమార్, ప్రముఖ పురాతన నాణేల సేకర్త తాళ్లూరి కామేశ్వరరావు, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకుడు దేవత రాజేష్, ఆరిఫ్ ఆలి, సత్తిబాబు, శాఖా గ్రంథాలయ ఉద్యోగి బుల్లియ్య, ఇతర సాహిత్యాభిమానులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డకు రక్షణ కరువు... హోమ్ మంత్రి రాష్ట్రానికి బరువు

### - విచ్చలవిడి గంజాయి సరఫరాతో రాష్ట్రం చిన్నాభిన్నం - లడ్డు ప్రసాదంపై విషప్రచారాన్ని నమ్మని ప్రజలు - మహిళలకు రక్షణలో పూర్తిగా ఫెయిల్ అయిన ప్రభుత్వం



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల భద్రతపై ముసురుకుంటున్న అనిశ్చితి మట్టుపెట్టలేనిదిగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి పాలనలో ఒక మహిళే హోమ్ మంత్రిగా ఉన్నప్పటికీ, ఆమె పాత్ర ఉత్సవ విగ్రహంలా మారిపోయిందని తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ప్రాంతంలో మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, ఇటీవల మదనపల్లిలో ఆరేళ్ల పసిబాలికపై జరిగిన దారుణం గంజాయి మత్తులో నిందితుడు చేసిన క్రూరకాండేనని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చింది ప్రస్తుత ప్రభుత్వమేనని ఆరోపిస్తూ, "గంజాయి నిర్మూలించాం" అని చెప్పుకుంటూ అధికారులు ప్రజలకు కాకినాడ లెక్కలు చెబుతున్నారన్నారు. అనపర్తిలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం జరిగిన ఘటనలో బాధిత కుటుంబంపైనే హత్యాయత్నం కేసు పెట్టడం కూటమి పరిపాలన దిగజారిన స్థాయికి నిదర్శనమని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై అనుచితంగా ప్రవర్తించిన వారిని చట్టం ముందు నిలబెట్టే వ్యవస్థలు పటిష్టంగా ఉన్నాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వంలో నేరస్తులకు శరణాలయంలాంటి పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా, మహిళా హోమ్ మంత్రి అనితకి చలనం లేకపోవడం సిగ్గుచేటని, ప్రజలకు భారం అయిన ఆమె ఆ పదవికి అనర్హురాలని నాగమణి వ్యాఖ్యానించారు. లోకేష్ రూపొందించిన రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కొనసాగుతున్న పాలన ఈ విధంగానే సాగితే, ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెప్తారన్నారు. అదే విధంగా ప్రపంచం ఛీత్కరిస్తున్న బిల్ గేట్స్‌ను రాష్ట్రానికి తీసుకు వచ్చి మహిళల ఆత్మాభిమానాన్ని మరొకసారి దెబ్బతీశారని ఆరోపించారు. ప్రజారోగ్యాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం ఏమాత్రం సమర్థించలేమన్నారు. తిరుమల లడ్డు ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన అసత్య ప్రచారంను ఇప్పటికే ప్రజలు తిప్పికొట్టారని, ఆ దుమారం దిగిపోయాక ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిల్ గేట్స్ ప్రహసనం ఆడుతున్నారని నాగమణి విమర్శలు గుప్పించారు.

# సముద్ర తీర గ్రామాలలో భౌగోళిక సరిహద్దుల నివేదిక సిద్ధం చేయండి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న పలు మండలాలలోని గ్రామాల భౌగోళిక విస్తీర్ణ సరిహద్దుల నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సముద్ర తీరంలోని సఖినేటిపల్లి, మామిడికుదురు, అల్లవరం, ఉప్పల గుప్తం, కాట్రేనికోన మండలాలలోని 6 గ్రామాల పరిధిలో 1,800 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి డ్రోన్ ఫ్లయింగ్ ఆధారంగా డిజిటల్ మ్యాపులు, ఇసుక రీచ్లు, ఖనిజాలు లభ్యత భౌగోళిక సరిహద్దులు విస్తీర్ణాలను గణించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సముద్ర తీరప్రాంత భౌగోళిక అంశాలు, మడఅడవులు విస్తీర్ణం, సము ద్రపు ఆటు పోటు సమయంలో సముద్రపు జలాలు ఏ మేరకు విస్తరిస్తున్నాయి అనే గణాంకాలను రూపొందించాలన్నారు. కోస్టల్ రీజియన్ జోన్ పరిధిని గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. సముద్రపు పోటు సమయంలో సముద్రపు జలాలు సమీపంలోని ఎంత మేర విస్తీర్ణానికి పోటెత్తుతున్నాయి గణాంకాలు రూపొందించాలన్నారు. తీర ప్రాంతంలో ఇసుక త్రవ్వకాలు ఇసుక త్రవ్విన ప్రాంతంలో మట్టితో నింపడం వంటి పనులపై జిల్లా గనులు భూగర్భ శాఖాధికారి బి అశోక్ కుమార్ నివేదిక అందించాలన్నారు. తీరం వెంబడి రక్షణ కవచంగా ఉన్న మడ అడవుల విస్తీర్ణాన్ని గణించి నివేదిక సమర్పించాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎంవివి ప్రసాద్ రావును ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ భూములలో పోటు సమయంలో ఎంతమేర సముద్రపు జలాలు విస్తరిస్తున్నది రెవెన్యూ శాఖ సర్వే చేసి నివేదిక అందించాలని డిఆర్‌ఓకే మాధవినీ ఆదేశించారు. భూ ఉపరితలంపై భౌగోళిక డేటాను స్థానాలు చిత్రాలతో రూపొందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే ప్రభాకర్, లీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం

### - ఈ ఏడాది చివరి నాటికి సమస్యను పూర్తి చేయాలని డిమాండ్ : ముప్పాళ్ళ నాగేశ్వరరావు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** అగ్రి గోల్డ్ బాధితుల ఆందోళనలకు తక్షణ పరిష్కారం చూపేందుకు విజయవాడలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని, అలాగే ఈ ఏడాది చివరి నాటికి మొత్తం సమస్యను పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ & ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కాకి నాడ సూర్య కళామందిరంలో అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ మూసి 12 ఏళ్లు అయినా సమస్య ఇంతవరకు అలాగే కొనసాగుతుండటం అత్యంత దురదృష్టకరమన్నారు. 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది కస్టమర్లు ఉండగా, ఒక్క ఆంధ్రప్ర దేశ్‌లోనే 19 లక్షలకు పైగా బాధితులు ఉన్నారని వివరించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ పేర్లతో దాచిపెట్టిన ఆస్తులను ప్రభుత్వము తక్షణమే స్వాధీనం చేసుకుని వేలం వేయాలని సూచించారు. 2015 జనవరిలో అగ్రిగోల్డ్ ఆస్తులను పోలీసులు సీజ్ చేసినప్పటి నుండి ఈ కేసు పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యం, యాజమాన్య నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. ఇంకా అగ్రిగోల్డ్ యాజమాన్యం వద్ద సుమారు రూ.5,000 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, వాటిని త్వరితగతిన వేలం పాటకు పెట్టి బాధితులకు న్యాయం చేయాలని ముప్పాళ్ళ డిమాండ్ చేశారు. మార్చి 2వ తేదీ నుంచి అగ్రిగోల్డ్ బాధితుల తరఫున రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మేనిఫె స్టోలో అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పినందున, ఆ వాగ్దానాన్ని నిలబెట్టేలా సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మేటి రాంబాబు, అర్జున్‌రావు, నారాయణరావు, బాధితులు పి.నరేష్ కుమార్, పి.నరసింహమూర్తి, మండ వీర రాఘవ, పివిఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ కాకముందు మానస వారణాసి ఏం చేసేవారో తెలుసా?




టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి పక్కా హైదరాబాదీ అమ్మాయి అని కొందరికే తెలుసు. మిస్ ఇండియా కిరీటం గెలిచినా, ఇంట్లో వాళ్ల కోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే కలల వైపు అడుగులు వేసింది. ఈ వీకెండ్‌లో వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో కెరీర్‌లో తొలి హిట్ అందుకున్న ఈ బ్యూటీ, తాను కేవలం గ్లామర్ డాల్ మాత్రమే కాదు.. పక్కా తెలంగాణ యాసలో తిట్టడం కూడా వచ్చని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు అభిమానులతో పంచుకున్నారు..వివరాలలోకి వెళితే.. మానస ప్రయాణం అచ్చం సినిమా స్టోరీలాగే ఉంటుంది. పుట్టింది హైదరాబాద్‌లోనే అయినా, తండ్రి ఉద్యోగం వల్ల మలేషియాలో చదువుకుంది. మళ్ళీ ఇక్కడికి వచ్చి ఇంజినీరింగ్ కాలేజీలో చదివే టైంలోనే మోడలింగ్‌పై మనసు పడింది. 2020లో మిస్ ఇండియా వరల్డ్ కిరీటాన్ని గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే మిస్ వరల్డ్ కిరీటాన్ని ధరించక ముందు రెండేళ్ల పాటు ఒక ప్రైవేట్ కంపెనీలో ఫైనాన్షియల్ అనలిస్టుగా పనిచేసింది. ఆ తర్వాతే మిస్ ఇండియా కిరీటాన్ని దక్కించుకున్న ఈమె తిరిగి ముంబైకి వచ్చేసిందట. ఇక అక్కడ ఏం చేయాలో తెలియక కొంతకాలం వర్క్ షాప్ చేస్తూ కెరియర్ కొనసాగించింది . కానీ 'దేవకీ నందన వాసుదేవ'సినిమాలో అవకాశం రావడంతో వెంటనే ముంబై నుండి హైదరాబాదు వచ్చేసి.. సినిమాల్లో ఎంట్రీ ఇచ్చినట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపింది. అయితే తొలి సినిమా ఆశించినంత ఆడకపోయినా, తన లుక్స్‌తో, పెర్ఫామెన్స్‌తో మెప్పించింది. ఇటీవల సంతోష్ శోభన్‌తో కలిసి నటించిన కపుల్ ఫ్రెండ్లీ సినిమా మానస కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇందులో 'మిత్ర'గా ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ సినిమా సక్సెస్ మీట్ మరియు ఇంటర్వ్యూల్లో మానస చాలా సరదాగా మాట్లాడింది. యాంకర్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. తనకు తెలుగు స్పష్టంగా వస్తుందని, తన మేనేజర్ పక్కా తెలంగాణ అని చెప్పింది. ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు ఆయనకు కోపం వస్తే తిట్టే తిట్లను వింటూ, తనకు కూడా కొన్ని బ్యాడ్ వర్డ్స్' మాట్లాడటం వచ్చేసిందని నవ్వుతూ బయటపెట్టింది. పద్ధతిగా కనిపించే ఈ మిస్ ఇండియాలో ఇలాంటి మాస్ యాంగిల్ కూడా ఉందని తెలిసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో తెలుగు అమ్మాయిల కొరత చాలా ఉంది. శ్రీలీల వంటి వారు బిజీగా ఉన్నప్పటికీ, స్టార్ హీరోలకు జోడీగా నటించే సత్తా ఉన్న కొత్త ముఖాల కోసం మేకర్స్ వెతుకుతున్నారు. ఈ క్రమంలో మానస వారణాసికి మంచి ఛాన్స్ దొరికినట్లే కనిపిస్తోంది. పక్కా లోకల్ కావడం, అటు గ్లామర్ ఇటు పర్ఫార్మెన్స్ రెండూ ఉండటంతో దర్శకనిర్మాతల దృష్టి ఆమెపై పడింది. సంతోష్ శోభన్‌తోనే మరో సినిమా కూడా చేస్తున్నట్టు సమాచారం. తన కెరీర్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటే, గ్లామర్ ప్రపంచంలో ఈ హైదరాబాదీ భామ లాంగ్ ఇన్నింగ్స్ ఆడటం ఖాయం.

# రూ.100 కోట్ల పారితోషికం క్లబ్‌లోకి శివకార్తికేయన్?



కోలీవుడ్‌లో అగ్ర హీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, అజిత్, విజయ్, సూర్య ఇంత మంది ఉండగా, వీళ్లందరినీ వెంబడిస్తున్న ఒకే ఒక్క హీరో శివకార్తికేయన్ అనే విషయాన్ని గమనించాల్సిన టైమ్ వచ్చింది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా బస్ కండక్టర్ శివాజీరావ్ గైక్వాడ్ నెమ్మదిగా నటనలో అడుగులు వేసి రజనీకాంత్‌గా మారి సూపర్‌స్టార్‌గా రూపాంతరం చెందిన తీరు గురించి ఎక్కువగా ముచ్చటిస్తాం కానీ, ఇప్పుడు మరో తమిళ హీరో శివకార్తికేయన్ ఎదిగిన తీరు గురించి ఆరా తీస్తే నోరెళ్లబెట్టకుండా ఉండలేరు! అతడి జర్నీ గురించి షాకిచ్చే విషయాలే తెలుస్తున్నాయి. శివ కార్తికేయన్ మరో రామ్ చరణ్‌లా ఎదుగుతున్నాడు అంటే అతిశయోక్తి కాదేమో! ఎలాంటి సినీనేపథ్యం లేకుండా ఒక మిమిక్రీ ఆర్టిస్టుగా మొదలై, అతడు నటనలో ప్రవేశించి ఈరోజు సూపర్ స్టార్‌గా ఎదిగాడు. లక్షలు కాస్తా కోటికి ఎగబాకింది అతడి పారితోషికం.. ఇప్పుడు ఏకంగా 30 కోట్ల నుంచి 60 కోట్ల పారితోషికం అందుకునే స్థాయికి ఎగబాకాడు. చూస్తుండగానే 100 కోట్ల పారితోషికం అందుకునే హీరోగా రూపాంతరం చెందుతున్నట్టే కనిపిస్తోంది సీన్. మొత్తానికి శివన్న జర్నీ చాలా మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. అతడు కెరీర్ ఆరంభ దశలో 3 అనే సినిమాలో ధనుష్ పక్కన చిన్న పాత్రలో కనిపించినప్పుడు ఎవరూ పెద్దగా గుర్తించలేదు. తెలుగువాళ్లకు అతడు ఎవరో కూడా తెలీదు. ఆ తర్వాత 2016లో వచ్చిన రెమో అనువాద సినిమాతో తెలుగు యువతకు.. ముఖ్యంగా అమ్మాయిలకు బాగా కనెక్ట్ అయ్యారు. వరుణ్ డాక్టర్ నుండి శివ కార్తికేయన్ ప్రతి సినిమా తెలుగులో మంచి ఓపెనింగ్స్ రాబడుతోంది. అమరన్ సినిమాతో ఆయనకు తెలుగులో 30 కోట్ల పైచిలుకు షేర్ రావడం ఒక సంచలనం. ఇటీవల వచ్చిన పరాశక్తితో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఇక పారితోషికంలో ఇప్పుడు 60 కోట్ల మార్క్ వద్ద ఉన్నాడు. నెమ్మదిగా అతడి రేంజ్ టెన్షన్ లేకుండా 100 కోట్ల పారితోషికం వైపు వెళ్తోంది. ఇది నిజంగా ఒక బ్యాక్ గ్రౌండ్ లేని హీరోకి నమ్మశక్యం కాని ఫిగర్. ఒకసారి గతంలోకి వెళితే.. హైదరాబాద్ తాజ్ కృష్ణలో అతడికి ఎదురైన చేదు అనుభవం గురించి మాట్లాడుకోవాలి. అతడు తన కెరీర్ తొలినాళ్లలోని సినిమాలను తెలుగులో రిలీజ్ చేయాలని తపించాడు. వాటి అనువాదాల ప్రమోషన్స్ కోసం హైదరాబాద్ తాజ్ కృష్ణకి వచ్చినప్పుడు అతడిని తెలుగు మీడియా అంతగా పట్టించుకోలేదు. ర్యాండమ్‌గా ఎవరో ఒక పొరుగు హీరో ప్రచారానికి వచ్చాడులే అనుకునేవారు. శివకార్తికేయన్‌కి ఇంత సీన్ ఉంటుందని కనీసం మీడియా అయినా ఊహించలేదు. అప్పట్లో టాలీవుడ్‌లో ఆయనొక కొత్త ముఖం కావడమే నాటి ఘటనలకు కారణం. అప్పటికి లక్షల్లోనే పారితోషికం..ఐదారేళ్లలో అతడి రేంజు 1 కోటికి చేరుకుంది..ఇప్పుడు 12 ఏళ్ల కెరీర్‌లో ఏకంగా 60 కోట్లు అందుకుంటున్నాడు.. అమరన్, పరాశక్తి విజయాలతో సీన్ అంతా మారిపోయింది.. మునుముందు 100 కోట్ల క్లబ్ లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అమరన్ 300కోట్ల క్లబ్ సినిమా. తదుపరి చిత్రం సియోన్ 500 కోట్ల క్లబ్‌లో చేరితే, అతడి డిమాండ్ 100 కోట్లకు చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. పారితోషికం పెంచుకోవడం హీరోల ఇష్టం గనుక ఇదేమీ కష్టం కాదు. మరింత డీటెయిల్డ్‌గా అతడి ఫ్లాష్ బ్యాక్ ని పరిశీలిస్తే, అతడు ఒక మిమిక్రీ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టి ఆ తర్వాత నటనా రంగానికి పరిచయమయ్యాడు. సినీ పరిశ్రమకు పూర్తిగా ఔట్‌సైడర్. అతడికి ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేదు. నేడు సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోగా ఎదిగాడు. అతడి తండ్రి జైలు శాఖలో పని చేసేవారు. చదువుకునే రోజుల్లోనే ఆయన తండ్రి చనిపోయారు. మొదట టీవీ షోలలో శివకార్తికేయన్ మిమిక్రీ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత విజయ్ టీవీలో యాంకర్‌గా సూపర్ హిట్ అయ్యారు. చాలామంది నటవారసులు తండ్రుల అండదండలతో ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నా ఇక్కడ పనవ్వడం లేదు. కానీ బాలీవుడ్‌లో కార్తిక్ ఆర్యన్, ఆయుష్మాన్ ఖురానా తరహాలో కోలీవుడ్‌లో శివకార్తికేయన్ తన కష్టంతోనే ఆ స్థాయి మాస్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. అందుకే అతడిని తమిళనాట నెక్స్ట్ లెవెల్ స్టార్ అని పిలుస్తున్నారు.

# శ్రీవిష్ణు వర్సెస్ శ్రీవిష్ణు.. బాక్సాఫీస్ క్లాష్‌పై క్లారిటీ వచ్చేసింది!



టాలీవుడ్ హీరోలు ఒక్కోసారి వరుస సినిమాలతో బిజీగా ఉండటం మామూలే. కానీ ఒకే హీరో నటించిన రెండు సినిమాలు ఒకే రోజు థియేటర్లలోకి రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. ఇప్పుడు యంగ్ హీరో శ్రీవిష్ణు కెరీర్‌లో అలాంటి పరిస్థితి ఎదురైంది. అతను నటించిన మృత్యుంజయ్, విష్ణు విన్యాసం చిత్రాలు ఫిబ్రవరి 27న ఒకేసారి రిలీజ్ అవుతున్నాయంటూ సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో చర్చ జరిగింది. దీనిపై శ్రీవిష్ణు రీసెంట్‌గా ప్రెస్ మీట్‌లో క్లారిటీ ఇచ్చారు.ఈవెంట్‌లో అడిగిన ప్రశ్నలకు శ్రీవిష్ణు తనదైన స్టైల్‌లో సమాధానం ఇచ్చారు. మీ స్టార్స్ అన్నీ బాగున్నాయా.. ఒకే రోజు రెండు సినిమాలు రిలీజ్ కావడం ఏంటి? అని అడిగిన ప్రశ్నకి ఆయన నవ్వుతూ బదులిచ్చారు. ఆ రెండు సినిమాలు ఒకే రోజు అయితే 100% రావడం లేదని కన్ఫర్మ్ చేశారు. ఈ విషయంలో రేపు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వస్తుందని చెబుతూ ఆ విషయంలో ఉన్న సస్పెన్స్‌కు తెరదించారు. ఒకే హీరో నుంచి ఒకే వారం లేదా ఒకే రోజు రెండు సినిమాలు రావడం వల్ల థియేటర్ల పంపిణీ, షోల కేటాయింపులో చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆ పెను ప్రమాదం అయితే ఇప్పుడు తప్పిందని శ్రీవిష్ణు సంతోషం వ్యక్తం చేశారు. కనీసం ఒక వారం గ్యాప్‌లో కూడా ఈ రెండు సినిమాలు రావని, ఫ్యాన్స్ కన్ఫ్యూజ్ అవ్వాల్సిన అవసరం లేదని క్లియర్‌గా చెప్పారు. దీంతో శ్రీవిష్ణు వర్సెస్ శ్రీవిష్ణు అంటూ జరుగుతున్న ప్రచారానికి బ్రేక్ పడింది. గతంలో నేచురల్ స్టార్ నాని కూడా ఇలాంటి క్లాష్‌ని ఫేస్ చేశారు. 2015లో ఎవడే సుబ్రహ్మణ్యం, జెండాపై కపిరాజు ఒకే రోజు రిలీజ్ అయ్యాయి. అందులో ఎవడే సుబ్రహ్మణ్యం మంచి హిట్ కొట్టి నాని కెరీర్ ని మలుపు తిప్పింది. ఇప్పుడు శ్రీవిష్ణు కూడా అదే తరహాలో రిస్క్ తీసుకుంటున్నారేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఆ సినిమాల మధ్య గ్యాప్ ఉంటుందని తెలియడంతో డిస్ట్రిబ్యూటర్లు కూడా ఊపిరి పీల్చుకున్నారు. శ్రీవిష్ణు ఎప్పుడూ తన కథల ఎంపికలో కొత్తగా ఆలోచిస్తుంటారు. మృత్యుంజయ్ సినిమా చాలా సీరియస్‌గా, యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అదే సమయంలో విష్ణు విన్యాసం మాత్రం ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రాబోతోంది. ఇలా రెండు భిన్నమైన జానర్లలో సినిమాలు చేస్తుండటంతో ఆడియన్స్‌లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.

కంటెంట్ బాగుంటే రెండు సినిమాలు కూడా బాక్సా ఫీస్ దగ్గర సక్సెస్ అవుతాయని సినీ ప్రియులు నమ్ముతున్నారు. ఇక ఫిబ్రవరి చివరి వారంలో శ్రీవిష్ణు సందడి మామూలుగా ఉండదు. రిలీజ్ డేట్స్ పై వచ్చే అఫీషియల్ అప్‌డేట్ కోసం అందరూ వెయిట్ చేస్తున్నారు. రెండు సినిమాల్లోనూ తన నటనతో అలరించడానికి శ్రీవిష్ణు రెడీ అయిపోయారు. మరి ఈ డబుల్ ఎంటర్టైన్మెంట్‌లో ఏ సినిమా బాక్సాఫీస్ దగ్గర గట్టిగా సౌండ్ చేస్తుందో చూడాలి.

# సముద్రపు దొంగ నిధి పెట్టెతో మనసు దోచిన గ్లోబల్ ఐకన్




ప్రియాంకా చోప్రా తన లేటెస్ట్ హాలీవుడ్ మూవీ ది బ్లఫ్ ప్రమోషన్స్‌లో బిజీబిజీగా ఉంది. ఈ ప్రచార కార్యక్రమంలో యాంజెల్‌ని తలపించేలా ఎల్లో సారీ-గౌన్ లుక్‌తో ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. ఈ లాంగ్ గౌనులో పీసీ ఎంతో ముగ్ధ మనోహరంగా ఉంది. చేతిలో ఉన్న ఆ చిన్న ట్రెజర్ చెస్ట్ (నిధి పెట్టె) బ్యాగ్ అంతకంటే ఎక్కువ చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన ఆసక్తికరమైన వివరాలు పరిశీలిస్తే ఈ బ్యాగ్ ఖరీదు అక్షరాలా ఆరు లక్షలు. ఈ బ్యాగ్ అమెరికన్ లగ్జరీ బ్రాండ్ జుడిత్ లీబర్ కు చెందింది. జుడీత్ విభిన్న ఆకృతుల్లో హ్యాండ్‌బ్యాగులు తయారు చేయడంలో ప్రసిద్ధి. దీని అసలు ధర 7,295 డాలర్లు. మన భారతీయ కరెన్సీలో దీని విలువ సుమారు రూ.6,63,623. ఇది చూడటానికి ఒక చిన్న నిధి పెట్టెలా ఉంటుంది. దీనిపై ఖరీదైన స్ఫటికాలు, రంగురంగుల రత్నాలు, ఇత్తడి హ్యాండిల్ ఉన్నాయి. దీనికి గుండె ఆకారంలో ఉండే ఒక చిన్న తాళం కూడా ఉండటం విశేషం. ఆ డ్రెస్ వెనుక అర్థం ఉంది. ప్రియాంక ఈ ఎల్లో సారీ-గౌన్ ధరించడానికి ఒక ప్రత్యేక కారణం ఉంది. ఇది పైరేట్ థీమ్‌కి సంబంధించిన లుక్. ది బ్లఫ్ సినిమాలో ప్రియాంక ఎర్సెల్ బోడెన్ (బ్లడీ మేరీ) అనే ఒక శక్తివంతమైన సముద్రపు దొంగ పాత్రలో నటించింది. అందుకే ఆ పాత్రకు గుర్తుగా ఒక ట్రెజర్ చెస్ట్ బ్యాగ్‌ని ఎంచుకుంది. తన పాత్ర సినిమా ఆరంభంలో తల మీద దుప్పటి వేసుకుని కనిపిస్తుంది. ఆ లుక్‌ను రీ-క్రియేట్ చేస్తూ, భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా పసుపు రంగు గౌన్‌ను సారీ లాగా డిజైన్ చేయించుకుంది. దీనిని గౌరవ్ గుప్తా డిజైన్ చేసారు. ది బ్లఫ్ ఫిబ్రవరి 25న నేరుగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. కథాంశం ఆసక్తికరం. 1800 సం.లో నాటి కరేబియన్ దీవుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ప్రియాంక తన కుటుంబాన్ని కాపాడుకునే మాజీ పైరేట్ క్వీన్‌గా కనిపించబోతోంది. రీసెంట్‌గా ఈ మూవీ ట్రైలర్ చూసిన మన దర్శక ధీరుడు రాజమౌళి ప్రియాంక నటనను ఫైరీ పెర్ఫార్మెన్స్ అని ప్రశంసించారు. పీసీ ప్రస్తుతం రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న వారణాసి సినిమాలో నటిస్తోంది. ఆమె హాలీవుడ్ యాక్షన్ లుక్ చూస్తుంటే రాజమౌళి సినిమాలో కూడా భారీ యాక్షన్ సీక్వెన్స్ లతో అదరగొట్టడం ఖాయమని అంచనా వేస్తున్నారు.


# తవాస్మి హిందీ సంచికను ఆవిష్కరించిన తెలంగాణ గవర్నర్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తవాస్మి హిందీ సంచికను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాజ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తవాస్మిని నేటి యువతకు అత్యంత అవసరమైన విలువల ఆధారిత విద్యా కార్యక్రమంగా అభివర్ణించారు. ఈ విలువలు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యలో భాగం కావాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో తవాస్మి ఇప్పుడు ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. రామాయణంలోని శాశ్వత విలువలను భావితరాలకు చేరవేయాలనే తవాస్మి ప్రయత్నంలో ఇది ఒక గొప్ప ముందడుగు. రామాయణంలోని జీవన విలువలను ప్రతి విద్యార్థికి, ప్రతి కుటుంబానికి, ప్రతి సమాజానికి చేరవేయాలనే ఈ యాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తవాస్మి బృందం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమం తవాస్మి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా తవాస్మి రచయిత శ్రీరామ చక్రధర్ గ్రంథాన్ని హిందీలోకి అనువదించిన స్వామి ఉరుక్రమానంద కు భాషా సరళీకరణలో సహకరించిన పి.శివ మునెమ్మకు, ఇంతటి బృహత్ గ్రంథం రూపుదిద్దడంలో సహకరించిన శారద దీప్తి, జాహ్నవి రెడ్డి, రితిక చక్రవర్తి తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బృందం రామనారాయణంలో కూడా అనేక మంది విద్యార్థులకు రామాయణంలోని విలువలను వివిధ కార్యక్రమాలు ద్వారా అందించడం విశేషం.

# సీతం విద్యార్థుల పారిశ్రామిక సందర్శన





**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం విశాఖపట్నంలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌ను పారిశ్రామిక సందర్శనను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు పరిశ్రమను సందర్శించి, పరిశ్రమలో జరుగుతున్న కార్యాచరణ, తయారీ విధానాలు, భద్రతా ప్రమాణాలు మరియు నిర్వహణ ప్రక్రియలను సమగ్రంగా అర్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మానవ వనరుల అధికారి కే.నగేష్ పాల్గొని, పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు, పనిపరమైన నైపుణ్యాల గురించి విద్యార్థులకు సూచనలు అందించారు. కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి డా.ఎస్.వరూధిని విద్యార్థులకు పరిశ్రమను సందర్శించే అవకాశం కల్పించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ అధ్యాపకులు ఎం.ప్రసన్న, వై.దీపిక, ఎం.వంశీ, ఏ.వైష్ణవి మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రతి ప్రభుత్వ శాఖ 'ఎ+' గ్రేడ్ సాధించడమే లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి - మార్చి 15లోగా రోడ్ల పనులన్నీ పూర్తి కావాలి - వైద్య సేవల్లో చీఁఖాఁ ప్రమాణాలు పాటించాలి - కెపిఐ సమీక్షలో జిల్లా అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత కీలక పనితీరు సూచికలలో అత్యుత్తమ ఫలితాలు సాధించి, జిల్లాను ప్రగతిపథంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశించారు. బుధవారం వివిధ శాఖల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అందే సేవల్లో నాణ్యతను పెంచడం ద్వారా మాత్రమే ఉత్తమ గ్రేడింగ్ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'బి' మరియు 'సి' గ్రేడ్లలో ఉన్న శాఖలు తక్షణమే లోపాలను సరిదిద్దుకుని 'ఖాం' గ్రేడ్ సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో డేటా నమోదులో జాప్యం ఉండకూడదని హెచ్చరించారు. జిల్లాలో రోడ్ల నిర్వహణ పనులు ఇప్పటికే 86% పూర్తయ్యాయని, మిగిలిన పనులను మార్చి 15వ తేదీ గడువులోగా పూర్తి చేసి 100% లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 88% ప్రగతిని, రాబోయే జాబ్ మేళాల ద్వారా 95%కి పెంచాలని ఉపాధి కల్పన అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రులు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికేషన్ పొందేలా మౌలిక వసతులు, సేవలలో మెరుగుదల ఉండాలని వైద్యులకు సూచించారు. పట్టణాల్లో చెత్త వేరు సేకరణ నూటికి నూరు శాతం అమలు చేయాలని, పచ్చదనం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా అన్ని శాఖల డేటాను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, పనితీరులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్, పార్వతీపురంనందు వాహనాలు వేలం నిర్వహణ: అసిస్టెంట్ ప్రొబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ పత్రికా ప్రకటన, ఏమనగా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన ద్విచక్ర వాహనములు బహిరంగ వేలం నిర్వహించుటకు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఉన్నతాధికారులు తే. 19.02.2026 ది న అనగా గురువారం నాడు నిర్ణయించినారు. కావున ఉదయం 11.00 గంటలకు పార్వతీపురం ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరుగు వేలం పాటకు హాజరు కావలసిందిగా కోరుచున్నాము. సదరు అవకాశము ను వేలంలో పాటదారులు వినియోగించుకోవలసినదిగా కోరుచున్నాము.

# బాల్య వివాహాలు, టీనేజ్ గర్భాల నివారణపై 'జీరో టాలరెన్స్'

**- ఐసీడీఎస్ సమావేశంలో కలెక్టర్ కీలక ఆదేశాలు**

**- మైనర్లపై అకృత్యాలకు పాల్పడితే 'పోక్సో' కింద కఠిన చర్యలు**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని చిన్నారులు, గర్భిణీ స్త్రీలు మరియు కిశోర బాలికల రక్షణ, ఆరోగ్యం విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశించారు. బుధవారం ఐసీడీఎస్ బృందం మరియు సీడీపీఓలతో నిర్వహించిన ప్రత్యేక వీడియో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భాల విషయంలో రాజీలేని 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో వన్ స్టాప్ సెంటర్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 100% ఆధార్ నమోదు ఉండాలని, ప్రతి బిడ్డకు ఆధార్ ఉండాలనే లక్ష్యంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ వారంలో నిర్వహించిన 9 శిబిరాల ద్వారా 88 మంది చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి మరియు శిశువుకు అభా కార్డులు తప్పనిసరిగా జారీ చేయాలని, దీనివల్ల వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో సమర్థంగా పర్యవేక్షించవచ్చని పేర్కొన్నారు. మైనర్ల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు మరియు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కేవలం పౌష్టికాహారం అందించడమే కాకుండా, స్థానిక బాలికలకు తోడుగా ఉంటూ వారి సమస్యలను వినే భరోసా కల్పించాలని సూచించారు. మనం కేవలం నిబంధనలను అమలు చేయడం లేదని, మన పిల్లల భవిష్యత్తును కాపాడుతున్నామనే సామాజిక అవగాహన అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పీడీ ఐసీడీఎస్ డా.టి.కనకదుర్గ, సీడీపీఓలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పాండ్రంకి వెంకట రమణపై వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతుంది

**- విజయనగరం ఇంచార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం పట్టణంకు చెందిన పాండ్రంకి వెంకట రమణపై అనే వ్యక్తిపై ఇటీవల భోగాపురం మండలంలో ముంజేరు మరియు వివిధ గ్రామాలకు చెందిన కొంతమంది ఫిర్యాదు చేసి చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గారిని ఆశ్రయించారన్నారు. పాండ్రంకి వెంకట రమణ ముంజేరు గ్రామం డ్రైనేజీ కాలువ సమస్యపై గ్రామంలో అందరిని రెచ్చగొట్టి భోగాపురం మండల కేంద్రం వద్ద రిలే నిరాహార దీక్షలు చేయిస్తున్నాడని, ఈ విషయమై వివిధ శాఖల అధికారులను, రాజకీయ నాయకులను, వివిధ కంపెనీల వారిని బెదిరిస్తూ డబ్బులు వాసులు చేస్తున్నాడని, అదే విధంగా ముంజేరు గ్రామ ప్రజలను కూడా చందాలు ఇవ్వమని, లేకపోతే అట్రాసిటి కేసులు పెడతామని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్కడ లాడ్జి నిర్మాణం చేసి, అందులో దందాలు నడుపుతున్నాడని, "అంబేద్కర్ రైట్స్" పేరిట ఒక అనధికార సంస్థను ఏర్పాటు చేసుకొని, దానికి తానే అధ్యక్షుడినని చెప్పుకొంటూ సెటిల్మెంట్లు, దందాలు చేస్తూ పోలీసు వారిని కూడా బెదిరిస్తుంటాడని, అదే విధంగా తన అనుచరులతో కలిసి భోగాపురం మండలంలో హేచరీలు, కంపెనీలు వద్దకు వెళ్లి లక్షలలో డబ్బులు వసూలు చేస్తున్నాడన్నారు. ముంజేరు గ్రామంలో కూడా కొంతమందిని చందాలు ఇవ్వమని, దళితులనుండి ఏ సమస్య వచ్చినా తానూ చూసుకుంటానని, ఒకవేళ చందాలు ఇవ్వకపోతే తమపై అట్రాసిటి కేసులు పెడతామని బెదిరిస్తున్నాడని ఆరోపించారని బాధితులు తెలిపారు. ఈ విషయంపై విజయనగరం ఇంచార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు విచారణ అధికారిగా నియమించారని తెలిపారు. విజయనగరం ఇంచార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ పాండ్రంకి వెంకట రమణ అనే వ్యక్తిపై అనేక ఆరోపణలతో వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామని, కొంతమంది బాధితుల స్టేట్మెంట్లు నమోదు చేసామని, తేది.20.02.2026 న భోగాపురం పోలీస్ స్టేషన్‌లో ఉదయం నుండి తాను అందుబాటులో ఉంటానని, ముంజేరు మరియు చుట్టు పక్కల గ్రామాల వారు ఈ విషయం గురించి ఎవరైనా ఏదైనా చెప్పాలంటే తనను నిర్భయంగా కలిసి తమ బాధలు చెప్పుకోవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే విచారణ పూర్తి చేసి నివేదికను పై అధికారులకు సమర్పిస్తానని తెలిపారు.

# ఆసుపత్రి వ్యర్థాలను ప్రతిరోజూ తరలించాలి

**- వెటర్నరీ ఆసుపత్రులూ నిబంధనలను పాటించాలి - నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు, ఆసుపత్రులన్నీ బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి మరియు ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణా కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్ణీత సమయంలోగా తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల కోడింగ్ బ్యాగులను ఉపయోగించి ఇంజక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న సుమారు 496 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పశుసంవర్ధక ఆసుపత్రుల నుంచి కూడా క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. సేకరించిన వ్యర్థాలను 48 గంటల గడువులోగా తరలించాలని, ఎక్కడా బయట కనిపించకూడదని స్పష్టం చేశారు.

ప్రతీరోజూ వ్యర్థాల సేకరణ, అప్‌లోడ్, తరలింపు జరగాల్సిందేనని స్పష్టం చేశారు. అంతేకాక, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను 'బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్'లో ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే నోటీసులు జారీ చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ప్రతీ ఇంటి నుంచీ బయో మెడికల్ వ్యర్థాలను సైతం సేకరించి, సరైన పద్ధతిలో వాటిని తరలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అలాగే వ్యర్థాలను బయట పడేసే ఆసుపత్రులపై నిఘా పెట్టాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవన రాణి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎ.పద్మజ, ఇతర వైద్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీసులు అంటున్న ప్రజలు

### - కత్తితో చెవు క్రింద కోసుకున్న యువకుడికి ప్రాణదానం





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారని రేణిగుంట పోలీసులు మరోసారి నిరూపించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక యువకుడిని తక్షణమే స్పందించి కాపాడటం ద్వారా స్థానికుల ప్రశంసలు అందుకున్నారు. అస్సాం రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు (సుమారు 25-30 ఏళ్లు) ఉపాధి కోసం కోయంబత్తూరు వెళ్తున్న క్రమంలో, మానసిక స్థితి సరిగా లేక రేణిగుంటలో రైలు దిగిపోయాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో సదరు యువకుడు ఒక్కసారిగా పదునైన కత్తితో తన కుడి చెవి కింద గొంతు భాగంలో తీవ్రంగా కోసుకున్నాడు. దీంతో రక్తం భారీగా ప్రవహించి యువకుడు రోడ్డుపై కుప్పకూలిపోయాడు. తక్షణమే స్పందించిన సీఐ జయచంద్ర ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే రేణిగుంట పట్టణ సీఐ జయచంద్రకి సమాచారం అందించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న సీఐ, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పోలీస్ స్టేషన్ నుండి సిబ్బందిని ఘటనా స్థలానికి పంపారు. కానిస్టేబుళ్లు రత్న ప్రసాద్, శీను, కనకరాజు మరియు ఉమాపతి వెంటనే అక్కడికి చేరుకుని, రక్తపు మడుగులో ఉన్న యువకుడిని ఆటోలో ఎక్కించుకుని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పిహెచ్‌సి) తరలించారు. సమయానికి ఆసుపత్రికి చేర్చడంతో వైద్యులు యువకుడికి ప్రథమ చికిత్స అందించి ప్రాణాపాయం నుండి తప్పించారు.

ప్రజల పక్షాన నిలబడి సేవ చేస్తున్న పోలీసుల తీరును చూసి స్థానిక ప్రజలు, వ్యాపారులు "శభాష్ పోలీస్" అంటూ కొనియాడారు. ఆపదలో ఉన్న వ్యక్తి భాష తెలియకపోయినా, పరాయి రాష్ట్రం వాడైనా సరే మానవ త్వంతో స్పందించిన సీఐ జయచంద్రకి మరియు సిబ్బందికి అందరూ ధన్యవాదాలు తెలియజేశారు.

## "తలశిల రఘురామ్‌కు కాకాణి పరామర్శ"





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శాసన మండలి సభ్యులు తలశిల రఘురామ్ తండ్రి, తలశిల చంద్రశేఖర్ రావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి వర్యులు, నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. గొల్లపూడిలోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి, పరామర్శించి, చంద్రశేఖరరావుకి నివాళులర్పించిన కాకాణి. కాకాణి వెంట పాల్గొన్న వెంకటాచలం మాజీ జడ్పిటిసి సభ్యులు మందల వెంకట శేషయ్య యాదవ్ తదితరులు.

## చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డికి టిడిపి కోవూరు మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవనే ధ్యేయంగా పెట్టుకుని నిస్వార్థంగా పనిచేస్తూ అందరికీ ఆద ర్శంగా నిలుస్తున్న నాయకుడనీ, సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కోరారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, విజయాలతో నిండిన దీర్ఘాయుష్షు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

## బిసిలకు ఆర్థిక భరోసా ఇచ్చిన బడ్జెట్: మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీల సంక్షేమం, వారి ఆర్థిక స్వావలంబన సాధనే లక్ష్యంగా పని చేస్తున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ బిసిలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా ఉందని వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. ఆర్థిక సమర్థత, సుస్థిరతతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్ళాలని చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి పయ్యావుల కేశవ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీ వర్గాలకు చేసిన కేటాయింపులపై హర్షం వ్యక్తం చేస్తూ 2025-26వ ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ. 47,000 కోట్లు కేటాయించగా, అదే 2026-27వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపు మరింత పెంచుతూ సుమారు రూ. 51,021 కోట్లు భారీగా నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ బడ్జెట్ బీసీల సంక్షేమ చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు.

**బీసీ సంక్షేమానికి రూ.51,021 కోట్లు బడ్జెట్**

బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన కూటమి ప్రభుత్వం... 2026-27 బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.51,021 కోట్లు కేటాయించిందని, అందులో ప్రత్యేకించి చేనేతలకు, నాయీ బ్రాహ్మణ సెలూన్‌లకు ఉచిత విద్యుత్తును ఇస్తోందని, మద్యం షాపుల్లో కల్లుగీత కార్మికులకు, మైనింగ్‌లో వడ్డెరలకు రిజర్వేషన్లను ఇస్తోందని, మత్స్యకార భరోసా, ఆటో డ్రైవర్ల సేవలో వంటి ఎన్నో పథకాలు బీసీలహాకోసం అమలు చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఎంఎస్ఎంఈ పార్కుల్లో అధిక భాగం బీసీ వర్గాల వారికి అవకాశం ఇస్తూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా స్థాపించబోయే పది ఎంజేపీ బీసీ గురుకులాలతో పాటు, ఇప్పటికే ఉన్న ఆరింటిని జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారని తెలిపారు. అలాగే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరు కావాలనుకునే బీసీ వర్గాల వారికి విజయవాడలో ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు విద్యారంగ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారని, వాటిల్లో ఒకటి లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ) స్కూల్స్ నిర్మాణ మని కొనియాడారు. దీనిని పైలట్ ప్రాజెక్టు కింద మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు జడ్పీహెచ్ స్కూలును లీప్ స్కూల్‌గా తీర్చిదిద్దారు. భవిష్యత్తులో నియోజకవర్గానికి ఒక లీప్ స్కూల్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పీఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం అనే మణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 70 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ



**కావలి, (రాజధాని వార్తలు):** కావలి పట్టణంలోని తొమ్మిదవ వార్డులో డెబ్బై లక్షల రూపాయల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఇంటింటికి శుద్ధ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పనులను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పదిహేనవ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో మార్చి నెలలలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత తొమ్మిదవ వార్డు ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ టీడీపీ అధ్య క్షుడు కిషోర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఈ ప్రాంతంలో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్యం పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చేయడమేనని అన్నారు. పట్టణ కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం

### - శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీ కాళహస్తీశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ కొనియాడారు. ప్రముఖ వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి చెందిన 220 మంది రోవర్లు, రేంజర్లు, స్కౌట్స్, గైడ్స్ సేవలందించారు. శివరాత్రి రోజున ఆలయంలోని క్యూ లైన్లలో భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు అందించి, రద్దీని క్రమబద్ధీకరించేందుకు సహకరించారు. అలాగే స్వామి, అమ్మవార్ల రథోత్సవం, తెప్పోత్సవం, కళ్యాణోత్సవాలలో కూడా తమ వంతు సేవలందించారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవంలో పాల్గొన్న రేంజర్లు, రోవర్లు, స్కౌట్స్, గైడ్లను శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ కలసి మాట్లాడారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు విశేషమైన సేవలు అందించారని ప్రశంశించారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యాలయ కమీషనర్ టి.రమేష్ బాబు పర్యవేక్షణలో ఇంచార్జి కార్యదర్శి విజయకుమార్, స్కౌట్ మాస్టర్లు మహేంద్ర, అజారుద్దీన్, విద్యా సాగర్, సుబ్రహ్మణ్యం, ధనుష్, మణికంఠ, గైడ్ కెప్టెన్లు, జ్యోతిర్మయి, సరిత, నిర్మల, రేంజర్, రోవర్ లీడర్లు నాయకత్వం వహించారు.

## గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన ఎం.సుబ్బయ్య



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలోని రేణిగుంట ఎయిర్ పోర్ట్ పరిసర ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యుడు ఎం సుబ్బయ్య బుధవారం సందర్శించారు. పాఠశాలలోని వసతులు, విద్యార్థుల విద్యా ప్రగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ వివరణ ఇస్తూ ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయారనే ప్రచారంలో వాస్తవం లేదని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో కే.వెంకీ, టి.అనిల్ కుమార్ అనే ఇద్దరు విద్యార్థులు పాఠశాల ప్రహరీ గోడ ప్రాంతంలో కనిపించగా సమాచారం అందుకుని విద్యార్థులు బయట కనిపించడంతో కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే వారిని సురక్షితంగా గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, తల్లిదండ్రుల కోరిక మేరకు వారిని కొద్దిరోజులు ఇంటికి పంపడం జరిగిందని వివరించారణ. పాఠశాల రికార్డులను, వంటశాల, తరగతి గదులను, పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని, రాబోయే పదవ తరగతి ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించేలా విద్యార్థు లను తీర్చిదిద్దుతున్నామని, వంటశాలలో నాణ్యమైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన చదువు మా ప్రథమ ప్రాధాన్యత, పాఠశాల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, ప్రిన్సిపాల్ రాధా కృష్ణ స్వయంగా అన్ని బాధ్యతలు చూసుకోవడం అభినందనీయమని గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

## ఫిబ్రవరి 22న గుంటూరులో భారీ 'గ్రామీణ డాక్ సేవక్' సమ్మేళనం

### - ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

**గుంటూరు, (రాజధాని వార్తలు):** భారతీయ తపాలా శాఖలో అంతర్భాగమై, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న గ్రామీణ డాక్ సేవక్‌ల అంకితభావాన్ని గుర్తిస్తూ, వారిని సన్మానించాలని కేంద్ర సమాచార మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సంకల్పించారు. వారి ఆలోచనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్, ఫిబ్రవరి 22, 2026న, గుంటూరులో భారీ 'జిడిఎస్ సమ్మేళనం' నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్, బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ సేవలను సామాన్యుడి ముంగిటకి చేరుస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఈ వేదికపై ప్రత్యేక పురస్కారాలు అందించి సత్కరించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు జ్యోతిరాదిత్య సింధియా మరియు తపాలా శాఖ ఉన్నతాధికారులు ఈ జీడిఎస్ సమ్మేళనంకు హాజరవుతారని తపాలా శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ సమ్మేళనం, గ్రామీణ ఆర్థిక వ్యవ స్థలో కీలక పాత్ర పోషిస్తున్న పోస్టల్ నెట్‌వర్క్‌ను మరింత బలోపే తం చేయడానికి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేరవేయడానికి, ఒక గొప్ప వేదికగా నిలవనుందని తపాలా శాఖ తన ప్రకటనలో తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లోని వివిధ విభాగాల నుండి సుమారు తొమ్మిది వేలమంది గ్రామీణ డాక్ సేవక్‌లు ఈ సమ్మేళనానికి హాజరుకానున్నారు. ఈ సమ్మేళనం, గ్రామీణ ప్రాంతాల్లో విశిష్ట సేవలందిస్తున్న జిడిఎస్‌లను ఉత్తేజ పరచటానికి దోహద పడుతుందని అందరూ భావిస్తున్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం‌ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ఛి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోస్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఐన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలి : డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరు మాన వత్వంతో స్పందించి, సాటి వారికి సహాయం చేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. 32వ వార్డు పకోడీ సందు ప్రాంతంలో నవ వధువు అనూషకు బంగారు తాళిబొట్టు, పట్టుచీర, పసుపు కుంకుమలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాల నుంచి కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు పరిధిలోనే కాకుండా నియోజకవర్గ పరిధిలో కూడా ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తాను ముందు ఉంటూ వారికి తన పరిధి మేరకు సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. నిరుపేద విద్యార్థులకు, వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, గర్భిణీ స్త్రీలకు తన వంతు సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా తన సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన, యాదగిరి శ్రీను, సిపిఐ బుజ్జి, అప్పారావు, శ్రీదేవి, కోదండమ్మా, జానకీ, సీత, ఉమా, హేమ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తీరు దేశానికి అవమానం...వ్యవసాయ - చేనేత రంగాలకు నష్టం : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** అమెరికా ట్రంప్ విధానాలకు మోడీ లొంగిపోవడంతో దేశంలో వ్యవసాయ, చేనేత రంగాలు నాశనం అవుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేయడం, అటవీ చట్టాలను మార్చి అడవి సంపదను పెద్దలకు అప్పగించడం మోడీ ప్రభుత్వ లక్ష్యమైందని ఆరోపించారు. ఎప్స్టీన్ ఫైల్స్‌లో మోడీ పేరు రావడంతోనే ఆయన అమెరికాకు సాగిల పడ్డారని నారాయణ వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ, మోడీకి ఎదురు చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదని, వ్యవసాయ భూములను కార్పొరేట్లకు చౌకగా అప్పగించడంలో ఇద్దరూ పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నాయకుల బానిసలుగా కాకుండా చట్ట ప్రకారం వ్యవహరించాలని సూచించారు. తిరుమల లడ్డూ కల్తీ కేసులో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్రాలకు భారంగా మోపడం కేంద్రం అన్యాయం అని అన్నారు.

**యానాం ఎమ్మెల్యే అశోక్ అవినీతిపరుడు : సీపీఐ నారాయణ**

యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బీజేపీలో చేరిన తర్వాత అవినీతిపరుడిగా మారాడని నారాయణ తెలిపారు. గత ఎన్నికల్లో ఆయన తరఫున తానే ప్రచారం చేశానని, ఈసారి అశోక్ పోటీ చేస్తే అతని ఓటమికి ప్రచారం చేస్తానని ప్రకటించారు.

# జలజీవన్ పథకం పైప్‌లైన్‌లు, కెనాల్‌ను పరిశీలించిన అధికారులు





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలం గొర్రెపూడిలో ధవలేశ్వరం సూపరింటెడెంట్ ఆఫ్ ఇంజనీర్ కే గోపీనాథ్, వి.వి.రామకృష్ణ బుధవారం జలజీవన్ పథకం పైప్‌లైన్‌లను, కెఎంజె కెనాల్‌ను, గొర్రెపూడి సమీపంలో కెనాల్‌ను ఇరిగేషన్ శాఖ అధికారులు, నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు (తాతాజీ)లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పరిపాలనలో ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కొనసాగుతున్నారన్నారు. రైతులందరికీ నీరు అందేలా అవసర చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పి.ఆనంద్ కుమార్, మెగా ఇంజనీర్ వి శ్రీనివాస్, ఏఈఈ నాగిరెడ్డి నాగభవానీ, బత్తుల సతీష్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల దీక్షను విజయవంతం చేయండి



**కాజులూరు, (రాజధాని వార్తలు):** ఈనెల 23, 24వ తేదీల్లో కాకినాడ కలెక్టర్ ఆఫీస్ వద్ద జరగబోవు 30 గంటలు దీక్ష జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కాజులూరు అంబేద్కర్ భవనంలో గోడ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం రాజశేఖర్ వల్లి రాజబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల్లో కౌలు రైతులను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పి 20 నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలు ఏ ఒక్కటే నెరవేర్చలేదని అన్నారు. గతంలో ఉన్న కౌలు రైతులు సిసిఆర్‌సి చట్టాన్ని రద్దు చేసి కౌలు రైతులకు మేలు జరిగే విధంగా 2011లో ఉండే ఎల్ఈసి చట్టం తీసుకొస్తామని చెప్పి నేటికీ తీసుకురాలేదు అన్నారు. అలాగే కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ గత రెండు సంవత్సరాలు వేయలేదని అలాగే తొలకరిలో నష్టపోయిన పంట నష్టం నేటికీ వేయలేదని అన్ని పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎమ్మెల్యేలకు మంత్రులకు ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదు అన్నారు. అలాగే ఎరువులు పురుగు మందులు ధరలు తగ్గించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కానీ కారణంగా ఈ నెల 23, 24వ తేదీల్లో 30 గంటల దీక్ష రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో జరు గుతున్నదని దేనికి సకాలంలో కౌలు రైతులందరూ వచ్చి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సువారు గోవిందు, కురుపూడి భూచక్రం, పెద్దింశెట్టి త్రిమూర్తులు, నరాల శ్రీనివాసరావు, కట్ట దశరధుడు, పెద్దిన్ చెట్టు కొండలరావు, కడలి గోవిందు, మేడిశెట్టి రామారావు, వనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan